

# లేఖాయణం

## ఉమ యేలూరి



*మనిషి మనసులోని భావాలకి ప్రతి రూపం, మనసులోని మాటలకి మరోరూపం ఉత్తరాలు. కార్డు, కవరు, ఎయిర్ మెయిల్, ఇ-మెయిల్, ఎస్.ఎం.ఎస్..ఎన్ని రూపాలు మార్చుకున్నా మనిషి ఎదురుగా చెప్పలేని భావాలకి అక్షర రూపం కల్పించడం ఒక కళ..! నెలనెలకీ కొన్ని ఉత్తరాల పరంపరని ఈ నెల నుంచీ ఈ శీర్షికలో మీరు చదువుతారు. వ్రాసేది, అందుకునేది ఎవరైనా కావొచ్చు.. అమ్మా, నాన్న, అక్క, చెల్లి, అన్న, తమ్ముడు, వదినా, మరదలు, బావా, నేస్తం, అనామిక, ప్రేయసి... ఎవరైనా.. ఒక్కో ఉత్తరంలో ఎన్నో భావాలు..కనిపించని కథలు, వినిపించని మౌన రాగాలు..! రచయిత్రి ఉమ గారు, ‘భావన‘ కలం పేరుతో* **http://kristnapaksham.blogspot.com/** *బ్లాగుని కూడా వ్రాస్తున్నారు.*

విజయవాడ,
29/06/86

నా శ్రీమతికి.

చూసావా నా మతికి ఒక శ్రీను చుట్టి నీకు బహుమతిగా ఇచ్చేసాను శ్రీమతి అని..

నీ మతి లేని భర్తలుంగారు వ్రాయునది... (అలా కళ్ళతో వెక్కిరించకోయ్ ఏ మనిషికైనా అవతలి అవతలి వాళ్ళు ఇచ్చే గౌరవం, అధికారం తీసుకోవటం చాలా బాగుంటుంది... భార్య తనకు అప్పణంగా ఇచ్చే అధికారం, ఆయాచితంగా పెళ్ళి అనే బంధంతో తీసుకోవటం ఇంకా బాగుంటుంది. అలా ఇస్తున్నావు కదా అందుకే ఇలా సంబోధించుకున్నా)

ఆషాఢం తరువాత శ్రావణం.. అబ్బో బహు అందం.. అందుకే అవసరం ఈ విరహం.. అని అర్ధంలేకుండా ఈ నవీన కవులు పుంఖాను పుంఖాలుగా వర్ణించి పారేసి, ఆధునిక కాల్పనిక దర్శకులు చిత్రరాజములు తీసి మనమీదకు తోస్తుంటే, తెలియని తనంతో నిజమనుకున్నందుకు నీ దగ్గరకు వచ్చి, నువ్వు ఇచ్చే ఏ శిక్ష అయినా భరించటానికి సిద్ధంగా ఉన్నాను.....

ఈ భార్యా భర్తల హోదాలో ఆషాఢం వచ్చి ఇలా దూరం పెంచుతుందంటే ఆషాఢమే లేని గాంధర్వ లోకంలోకి తీసుకుని వెళ్ళి పరిణయమాడే వాడిని కదా చెలి.! చూశావా మా అను వాళ్ళ నాన్నగారు అన్నట్లు "కలలో కూడా మట్టి ముంతేనా" అని, గాంధర్వలోకంలో కూడా పరిణయమాడాలేమిటి.... ఆ లైసెన్స్ ఉండాలా కలిసి కదిలే మనుగడకు!? అసలు గాంధర్వ లోకంలో ఆషాఢ ముండదు అని నమ్మకం ఏమిటిరా? ఎవరైనా ఏ పురాణాలలో కాని గాంధర్వలోకాలలో కూడా తిధులు, మాసాలు ఉంటాయని చెప్పారేమో మీ రాక్షసి నాయనమ్మను కనుక్కో. ఉంటే అక్కడకు కూడా వచ్చి ఇలాంటి వెధవ రూల్ ఏదో పెడుతుంది ఆవిడ. ఐనా నువ్వేమి తక్కువా!? అణకువగా మా అమ్మ చెప్పిందని మీ బామ్మ అందని, జీవితాలకు ఉపయోగపడే పని చేయకుండా రోజంతా ఆ పూజలేమిటో, రాత్రికి నాకు ఉపవాసమెందుకో!? సరేకాని.... కర్మ సిద్ధాంతం నాదైతే, భక్తి సిద్ధాంతం నీది.... హ్మ్.!

ఏమిటోరా ఏమి తోచటం లేదు. కాలం కదలటం లేదు. నువ్వుంటే సాయింత్రమైతే కాలానికి పంచకల్యాణి రెక్కలొచ్చేవా!? ఇప్పుడేమో కాలాన్ని ఎవరో గుప్పిట బిగించేసారేమో కదలటమే లేదు అనిపిస్తోంది. నిన్న సాయింత్రం ఇంటికి వచ్చేసరికి ఏదైనా మాజిక్ జరిగి నువ్వు మన బెడ్ రూంలో రాకింగ్ చైర్‌లో, ఆ ఊదా రంగు చీరలో, తలలోని జాజుల మాలను మునివేళ్ళతో తిప్పుతు పుస్తకం

చదువుతూ కనపడతావేమో అని ఎంత ఆశగా వచ్చి చూసానో! ఏమిటో అలాంటి మాజిక్‌లు పుస్తకాలలో తప్ప నిజ జీవితంలో జరగవనుకుంటా, రాత్రి నిద్రపోతున్నా ఎప్పుడో చెవి మీద నీ మునిపళ్ళ స్పర్శ గిల్లుతు "కృష్ణం కలయ సఖి సుందరం" అని గుస గుసలాడుతు పాడినట్లే ఉందిరా! అది స్పర్శ బలమో లేక ప్రేమ మహిమో మరి ఇంక మిగతా రాత్రి అంతా జాగారమే.

రాత్రి అలానే నిద్రపట్టక ఆలోచిస్తూ అనుకున్నా. నేను ఎప్పుడూ ప్రేమించి పెళ్ళి చేసుకోవాలి అనుకునేవాడిని. ప్రేమించకుండా, ఎవ్వరో.. ఎలాంటి వాళ్ళో తెలియకుండా ఎలా మొదలు పెడతాము జీవితం అని. కాని దురదృష్టవశాత్తు ఎప్పుడు అంత టైం దొరకలేదు. ప్రేమిద్దామనుకునే సరికి పిల్ల దొరకలేదు. అమ్మకేమో ఆగేంత తీరిక దొరక లేదు. ఇదుగో ఇలా నా పక్కన నువ్వు. కానీ ఇప్పుడిప్పుడే అర్థం అవుతోంది, నాది ఎంత మంచి ఆలోచనో! నిన్నే నేను పెళ్ళికి ముందు కలుసుకుని ఉంటే, నీ సున్నితమైన మనసు నీ అవధులు లేని ప్రేమ నాదవటం కోసం నే పాట్లు పడితే, ఆ పాట్ల ఫలితంగా నా చిన్నారి అపరంజి నాదై.. నాప్రేమైవుంటే!? ఇంకా ఎన్నెన్నో అద్భుతమైన ప్రేమ పరిమళాలు మన జీవిత కదంబంలో తోడయ్యేవి కదా అని! అబ్బ ఆశకు అంతులేదంటావా?

అంత ఆశ ఎందుకులే, వెళ్ళేవు, ఇంతవరకూ ఉత్తరం రాసావా? ఫోన్ చేసావా? ఈ రోజు పొద్దుటే చేరావు కదా ఒక్క ఉత్తరమైనా రాయలేదు. ఒక్క ఫోన్ కూడా చెయ్యలేదు! మీవాళ్ళను చూస్తే ఇంక వీడేమి గుర్తుకువస్తాడులే.

ప్చ్.. నా దురదృష్టం కాకపోతే మీనాన్నకు ఇప్పుడే ఆ ఢిల్లో బదిలీ అయ్యి అక్కడికి వెళ్ళాలా!? నాకేమో ఈ హాస్పిటల్ పని ఇంత వత్తిడిగా ఉండాలా? ఇంకా 3వారాల 4 రోజులు అంటే 25 రోజులు... అంటే 600 గంటలు.. అంటే 36000 నిమిషాలు... అంటే 2160000 సెకండ్స్... ఎలా రా చిన్నా!? పోని ఒక పని చెయ్యి. హఠాత్తుగా చాలా జబ్బు చేసింది.. గుండె సరిగా కొట్టుకోవటం లేదు... ఊపిరి ఆడటం లేదు... నాలిక పిడచ కట్టుకుపోతోంది అని చెప్పు. బయలుదేరే ముందే అలా ఉంది అనే కదా చెప్పావు, అదే మీ వాళ్ళకు చెప్పు.. నేను వెంటనే మొగుడు ఇంత పెద్ద కార్డియాలజిస్ట్ అయ్యి ఉండి చూడకపోవటమా అని ఆ వంక పెట్టుకుని వచ్చేస్తాను.!

బాగోలేదా ఐడియా? బాగోలేకపోతే బాగోలేదు అని చెప్పాలి. భార్యారత్నం..! అంతలా తుళ్ళి తుళ్ళి నవ్వకు నాకు వెక్కిళ్ళొచ్చేస్తున్నాయి మరి.

ఇంక కష్టపడాలి నిద్రకోసం.. మళ్ళీ రేపు ఎల్లుండి నూజివీడు దగ్గర మెడికల్ కేంప్ ఉంది. ఏమిటోరా కొందరికి ధనదారిద్ర్యం. కొందరికి మనో దారిద్ర్యం, కొందరికి భావ దారిద్ర్యం, కొందరికేమో భార్య ఉండి భార్యా దారిద్ర్యం.. నీ తలపుల వలపుల్లో చెలినే! సదా ఒక ప్రేమ పిపాసినే!!

నీ కనుల కొలుకుల్లో నేనెప్పుడు నీ ప్రతిరూపాన్నే!

నీ గుండెలోతుల్లో మరెప్పుడూ... ప్రేమ ఖైదినే.!

ఇప్పటికి మాత్రం నీ చేతులలో మెలగబోయే అదృష్టానికి నోచుకోబోతున్న ఈ కాగితాన్ని ఈర్ష్యాసూయలతో పరికిస్తున్న విరహబాధితుడినే..

ఉండనా మరి.

ప్రేమతో,

అపరంజి పక్కన నీలిమేఘం

నీ నల్లనోడు...

✡ ✡ ✡

రాజధాని,

01/07/86

"శ్రీ"వారికి,

మీ మతిని మాత్రం నా దగ్గర ఉంచుకుని "శ్రీ" ను తిరిగి పంపించేస్తునా.

ఆషాఢ భూతం మన మధ్య శారీరక దూరం పెంచగలిగిందే కాని మానసిక దూరాన్ని కాదుగా. రెప్ప వాల్చండి మీ కనురెప్పల మాటున నేను, కనుమూసిన కునుకై. నన్నల్లుకున్న మీరు... వేరు ఎలా అవుతాము!?

అంత నెపమూ నా మీద...!!! "నువ్వు ఊపిరి పీల్చటం మర్చిపోయావు... నీ గుండె కొట్టుకోవటం ఆపావు" అని అభియోగం మోపినట్లు ఉంది మీరు నాపైన వేసిన అపవాదు వింటే. నేను మిమ్ములను మర్చిపోయేనా మా వాళ్ళనందరిని చూడగానే! "మా వాళ్ళ" లిస్ట్‌లో మొదటగా వచ్చేది నావాడివి నువ్వేగా. ఎలా మర్చిపోతాను!? మీరు రోజు నాతో పోట్లాడి "మీరు" ఏమిటి పరాయివాడిలా నువ్వు అనమన్నప్పుడు కలిగే బిడియమే, నెరుకే ఆపింది నన్ను, ఇంటికి రాగానే ముందుగా మీకు ఉత్తరం రాయకుండా...

ఎందుకలాగా అని అలగకండి అల్లరి కృష్ణయ్యా! కృష్ణయ్య ఊపిరి వదిలిన మాధురులతో వేణుగానం పలకగలదు కాని, తనంత తానై మోగగలదా? మ్రోగినా ఆ గానానికి విలువ ఉంటుందా? మీ నుంచి లేఖ రాకుండా నేను రాసే జాబైనా అంతే. కోపగించకోయి చిన్ని కన్నా... వలపులిస్తా... వెన్నంటి వయసునిస్తా! చాలదంటే గుండెగదిలోన మారుమోగే వలపుల అగరు దీపాల ఆరతి రాత్రికిస్తా!! చాలా ... కోపం పోయిందా? నవ్వాలి మరి. మీరు నవ్వకుండా ఎవరో పేషెంట్‌ను పలకరిస్తే అతను ఆ తరువాత ఎంత వైద్యం చేయించుకున్నా జబ్బు తగ్గనే లేదట. మొన్న మీ హాస్పిటల్‌కు వచ్చినప్పుడు నర్స్‌లు చెప్పుకుంటుంటే విన్నా. కృష్ణా, ఇక్కడకు వచ్చిన క్షణం నుంచి అనిపిస్తోంది.. ఏమిచ్చి దేవుడికి పొందగలిగేను ఇంత మంచి సహచరుడిని అని! ప్రేమించి పెళ్ళి చేసుకుందామనుకున్నారా? అపుడూ నా స్థానంలో వేరే అమ్మాయి ఉండేదేమో!? ఎందుకంటే మిమ్మలను ప్రేమించి, మీ అల్లరిని భరించి (ముద్దుగా నేలే) మీతో కలిసి తిరగగల అనుభవం, అదృష్టాన్ని మా అమ్మా నాన్నలు నాకు ఇచ్చేవారా అంటే అనుమానమే!? కాదేమో ఖచ్చితమే... ఇచ్చేవారు కాదు... అమ్మో నేను కాకుండా ఇంకో అమ్మాయా ఆ ఆలోచనే, హేమంతాన మంచుకు వణికి రాలే ఆకల్లే మనస్సుని కుదిపేస్తోంది. మరుక్షణమే యశోదగా మారి నా కృష్ణుడిని కట్టెయ్యాలనిపిస్తోంది. యశోదగా మారి రోటికి కట్టినా, రాధగా మారి వలపుతో ఆకట్టినా... రుక్మిణిగా మారి భక్తితో జోకొట్టినా.... అన్నిటి అంతరార్థం, అంతఃసూత్రం ప్రేమే కదా కాదంటారా?

ఇలా ఇంటిలోకి అడుగుపెట్టి అమ్మ అడిగిన ప్రశ్నలకు సమాధానం పూర్తికూడా చెయ్యలేదు నాన్నగారు, "అపర్ణా అల్లుడిగారి ఫోన్" అని పిలుస్తుంటే అందరి కళ్ళలో కదిలిన నవ్వు చూస్తే ఎంత సిగ్గు! అంతలోనే ఎంత గర్వమనిపించిందో తెలుసా? ఇందాక భోజనాల దగ్గర "ఏంటమ్మా అలా చిక్కిపోయావు? " అని అమ్మ ప్రేమగా అడుగుతుంటే, వదిన కన్ను మలిపి, "సరిగా నిద్ర ఉండటం లేదేమో, అదే ప్రయాణం హడావుడిలో" అని అన్నయ్యవైపు తిరిగి నవ్వుతుంటే, ఆ నిద్రలేమికి కారణమైన మీ మీద చాలానే కోపం వచ్చింది. కాని మరి ఆ నిద్రలేమి అలవాటు అయ్యో ఏమో మరి, రాత్రులు నిద్రరావడం లేదు నాకు కూడా మీకు లానే!

ఈసరికే నూజివీడు కేంప్‌లో ఉండి ఉంటారు కదు... కృష్ణా నాకు మిమ్మలను తలుచుకుంటే ప్రేమతోపాటు గర్వంగా కూడా ఉంటుంది తెలుసా...

"ఉన్నవాడికి వెండి పళ్ళెంలో విందుపెట్టటం కాదు, లేనివాడికి విస్తరిలో ఒక కూరతో అన్నం పెట్టటం తృప్తి. మనకున్న విద్య మనకు ధనాన్ని సంపాదించి పెట్టటం మనకు ఉపయోగపడటం. కాని మనవిద్య ప్రయోజనం ఆశించకుండా నిండు జీవితాలను కాపాడటానికి ఉపయోగపడటం విద్యకు పరమార్థం" అని నిర్వచించి వాటిని ఆచరించే ఒక అద్భుతం నా సహవాసిగా సహచరుడిగా నాకు లభించటం.... ఈ అపురూప వరం మళ్ళీ మళ్ళీ ఎప్పటికి నా సొంతం కావాలని కోరుకుంటూ అయ్యగారి నుంచి ఈ క్షణానికి కాగితం మీద సెలవు తీసుకుంటు, తలపులలోకి ఆహ్వానిస్తూ

మీ - అందాలగని - అపర్ణ (సంతోషంగా ఉందా!? మీరడిగిన సంతకం పెట్టాను)

✡ ✡ ✡